క్లుప్తంగా

మహాత్మాగాంధీకి నివాళులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ టీబీ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం తీసుకు రావడంలో మహాత్మాగాంధీ కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, డాక్టర్ బాలాజీ, డాక్టర్ సమీర, డాక్టర్ విద్యాసాగర్, డెప్యూటీ డెమో డాక్టర్ ప్రభాకరరెడ్డి, విజయ్, మహేష్, రామకృష్ణ, సీతాకల్యాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన



విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. త్యాగరాజ స్వామి పుణ్యతిథి బహుళ పంచమి సందర్భంగా సంగీత విద్వాంసులు నగర సంకీర్తనా కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో త్యాగరాజ స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలతో సంగీత కళాశాల నుంచి నగర సంకీర్తనా కార్యక్రమం నిర్వహించారు. సంగీత విద్వాంసులు సహితం పల్లకీ మోసి త్యాగరాజ స్వామి పట్ల ఉన్న తమ భక్తిని చాటుకున్నారు. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, వేమూరి విశ్వనాథ్, మల్లాది కార్తీక త్రివేణి, భమిడిపాటి శ్రీలలిత, సురేష్, రామలక్ష్మితోపాటు యువ సంగీత కళాకారులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



బస్టాండ్(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర ప్రజా రవాణా సంస్థలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీసీ ఉద్యోగ సంఘం నేతలు విజయవాడ జోన్ చైర్మన్ ఎస్.మహేష్‌కు వినతి పత్రం సమర్పించారు. మంగళవారం విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో జోన్ చైర్మన్ మహేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన పీటీడీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లి, పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన జోన్ చైర్మన్ తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు టి.సూరిబాబు, శంకర్, ఏవీఎస్ఎన్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

చెస్ క్రీడాకారిణి సోనికాకు అభినందన



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చెస్‌లో రాణించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని సోనికాను అభినందిస్తున్నామని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు పేర్కొన్నారు. కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ 5వ తరగతి విద్యార్థిని డి. సోనికా తెలంగాణ, ఏపీలో నిర్వహించిన చెస్ టోర్నీలో రాణించింది. ఈ నేపథ్యంలో మంగళవారం స్కూల్‌లో సోనికా అభినందన సభ నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆల్ ఇండియా ఓపెన్, చిల్డ్రన్స్ చెస్ టోర్నమెంట్‌లో అండర్–12 విభాగంలో సోనికా మొదటి స్థానంలో నిలిచిందని, శ్రీ చెస్ అకాడమీ నిర్వహించిన అండర్–11 విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సోనికాకు సత్కరించారు.

అభివృద్ధే మా నినాదం

- వీఎంసీ కౌన్సిల్‌లో మేయర్ భాగ్యలక్ష్మి
- పీఎంఏవై – టిడ్కో ఇళ్ల అవకతవకలు, విజిలెన్స్ విచారణపై చర్చ
- పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం





కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేయటమే తమ నినాదమని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో మేయర్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరాభివృద్ధిని గత పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగున్నరేళ్ల కాలంలో విజయవాడ నగరాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశామని, మూడు సర్కిళ్ల పరిధిలోని 64 డివిజన్లలోనూ తాము చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. సమావేశంలో మొత్తం 121 అంశాలు అజెండాలో ప్రతిపాదన రాగా అందులో 110 అంశాలు ఆమోదం పొందాయి. రెండు అంశాలు ఆఫీస్ రిమార్క్‌కు పంపారు. రెండు అంశాలను ధ్రువీకరించారు. మూడు అంశాలను విద్యాశాఖకు, ఒక అంశాన్ని సెర్ప్‌కు(సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ)కి సిఫార్సు చేస్తూ తీర్మానించారు. రెండు అంశాలు రికార్డు చేయగా, ఒక అంశాన్ని ఆఫీసు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టీడీపీ వర్సెస్ వైఎస్సార్ సీపీ..

ప్రశ్నోత్తరాల సమయంలో టిడ్కో పీఎంఏవై(ప్రధాన మంత్రి ఆవాస యోజన)–ఏపీ హౌసింగ్ టిడ్కో లబ్ధిదారులకు కేటాయింపులపై వచ్చిన ప్రశ్నపై వైఎస్సార్ సీపీ–టీడీపీ మధ్య వాడీవేడి వాగ్వాదం జరిగింది. దీనిపై గతంలో విజిలెన్స్ విచారణకు కౌన్సిల్ తీర్మానం చేసినా ఇంత వరకు ఎలాంటి పురోగతి లేకపోవటంతో మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధికారులను, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను వివరణ కోరారు. వీఎంసీలోని ఎస్టేట్స్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగాలకు సంబంధించి ఎన్ని కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.. హైకోర్టు, లోకల్ కోర్టుల వారీగా కేసుల వివరాలను అడిగిన ప్రశ్నపై ఆయా విభాగం అధికారులు కేసుల వివరాలను సభ్యులకు వివరించారు.

ప్రధానాంశాలు..

- ఎన్టీయార్ సర్కిల్ నుంచి పాత చెక్‌పోస్టు వరకు ఉన్న బందరురోడ్డును 100 అడుగుల రోడ్డుగా విస్తరించేందుకు పనులు గతంలో ప్రారంభించి మధ్యలో ఆగిపోయాయని, తిరిగి పనులు ప్రారంభించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆఫీస్ రిమార్కులు కోరుతూ తీర్మానించారు.
- గతంలో టిడ్కో ఇళ్ల నిమిత్తం ప్రభుత్వానికి లబ్ధిదారులు తమ వాటా మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించారని, కానీ వారికి ఇళ్ల మంజూరు కానందున తిరిగి వారి సొమ్మును చెల్లించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదించారు.
- మాజీ కార్పొరేటర్ పాముల మాలకొండయ్య ఆర్థిక పరిస్థితి అంతగా బాగోలేదని, ఆయన ఉండేందుకు నివాసం కూడా లేకపోవటం ఇబ్బందులు పడుతున్నారని, ఆయనకు మానవతా దృక్పథంతో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకంలో ఒక ఇంటిని కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదించారు.
- నగరంలో కుక్కలు, దోమలు, కోతుల బెడద అధికంగా ఉందని వీటిని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కార్పొరేటర్లు చేసిన ప్రతిపాదనపై వీఎంసీ కౌన్సిల్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామన్నారు.
- సర్కిల్–1 పరిధిలోని ఎర్రకట్ట జంక్షన్ నుంచి లోటస్‌ల్యాండ్ మార్క్ వరకు ఉన్న 5వ లైన్ సీసీ రోడ్డు వేయాలని అందుకు అయ్యే రూ. 60 లక్షలు వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలుపుతూ తీర్మానించారు.
- 37వ డివిజన్‌లోని జెండాచెట్టు సెంటర్ నుంచి హిందూహైస్కూల్ వరకు సుబ్బరామయ్య వీధి బీటీ రోడ్డు వేయటానికి అయ్యే రూ. 62.12 లక్షలు వీఎంసీ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనను ఆమోదిస్తూ తీర్మానించారు.
- సెంట్రల్ నియోజకవర్గం 3వ డివిజన్‌లోని అయోధ్య నగర్‌లో బుడమేరు కట్ట వెంబడి సీకే రోడ్డు నుంచి సూర్యా కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.72.56 లక్షలు నిధులను కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనను ఆమోదించారు.

దుర్గమ్మ సేవలో దేవదాయశాఖ కమిషనర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కమిషనర్ సత్యనారాయణను ఆలయ ఈవో కేఎస్ రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో రామారావు అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న మాస్టర్ ప్లాన్ పనులు, మల్లేశ్వర స్వామి వారి ఆలయాభివృద్ధి పనుల గురించి ఈవో, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి వివరించారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పలువురిని అంతర్గత బదిలీలు చేస్తూ ఆలయ ఈవో కేఎస్ రామారావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. సూపరింటెండెంట్ వై. హేమదుర్గాంబ పూజలు, ఫెస్టివల్, ప్రొవిజన్ స్టోర్స్‌తో పాటు ధర్మపథం విధులను కేటాయించారు. కనకదుర్గప్రభ ఎడిటర్ కె. గంగాధర్‌కు అదనంగా పీఆర్వో, ప్రెస్ రిలేషన్ విధులను కేటాయించారు. సీనియర్ అసిస్టెంట్ బి.నాగరాజుకు వేద పాఠశాల, అన్నదానం హాల్ నిర్వహణతో పాటు ప్రసాదం తయారీ స్టోర్స్ బాధ్యతలు అప్పగించారు. ఇక సీనియర్ అసిస్టెంట్ పీవీ రమణకు ప్రసాదం తయారీ కేంద్రం నుంచి ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి, జూనియర్ అసిస్టెంట్ వీవీఎస్ఎస్ రామ్‌కు పేబిల్స్ విభాగానికి, పి. శ్రీనివాసరావుకు వేద పాఠశాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. టి. సుబ్రహ్మణ్యంను రికార్డు రూమ్ నుంచి మూడు రోజులు ప్రధాన ఆలయం, మరో మూడు రోజులు ప్రొటోకాల్ విధులు అప్పగించారు. రికార్డు అసిస్టెంట్ కె. రమేష్‌ను సత్రాల నిర్వహణ నుంచి రికార్డు రూమ్ బాధ్యతలు అప్పగించారు.

అక్కచెల్లెమ్మలకు 'ఆసరా'

నేడు పశ్చిమంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ



స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు (ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకున్న ఘనత జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుంది. 'మాట ఇస్తే.. మడమ తిప్పేదిలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి చేతలలో నిరూపించారు. స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) పొదుపు మహిళలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ఐదేళ్ల క్రితం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో తెలుసుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే 2019 ఏప్రిల్ 11వ తేదీ వరకు ఉన్న ఎస్‌హెచ్‌జీ రుణాలను మాఫీ చేశారు. రద్దు చేసిన రుణాలను నాలుగు విడతలుగా మహిళల ఖాతాలో జమ చేస్తానని హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగా 2020 నవంబర్ 11న మొదటి విడత, 2021 అక్టోబర్‌లో ఏడున రెండో విడత, 2023 మార్చి 25న మూడో విడత సొమ్మును, తాజాగా నాలుగో విడత డబ్బును ప్రభుత్వం చెల్లించింది. దీనికి సంబంధించిన నియోజకవర్గ స్థాయి కార్యక్రమం బుధవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

నాలుగో విడత 27,532 మందికి..

పశ్చిమ నియోజకవర్గంలో 2,783 సంఘాలు ఉన్నాయి. అందులో సుమారు 27,352 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ సమయానికి వీరు సుమారుగా రూ.81,63,01,001 మేర బ్యాంకులకు అప్పుగా ఉన్నారు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు నాలుగు విడతలుగా ఆ మొత్తాన్ని అక్క చెల్లెమ్మల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇప్పటికే మూడు విడతలు పూర్తి కాగా బుధవారం నాలుగో విడతగా పశ్చిమ నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల ఖాతాల్లోకి జమ కానున్నాయి. 27,352 మంది సభ్యుల ఖాతాల్లోకి నాలుగో విడతగా రూ.20,63,83,667 జమ కానున్నాయి. దీనికి సంబంధించిన చెక్కు పంపిణీ కార్యక్రమం పాతబస్తీలోని ముసాఫిర్‌ఖానా ప్రాంగణంలో బుధవారం జరుగుతుందని సర్కిల్–1 సీడీవో దుర్గాప్రసాద్ తెలిపారు.

దమ్మున్న సీఎం వైఎస్ జగన్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్



ముఠా కార్మికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'మీకు మేలు చేస్తేనే నాకు ఓటు వేయండి' అని ప్రజల్లోకి ధైర్యంగా వెళ్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. ఆ విధమైన చిత్తశుద్ధి కలిగిన ముఖ్యమంత్రి భారతదేశంలో జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో గడపగడపకు ఆసిఫ్ కార్యక్రమంలో భాగంగా 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ఆధ్వర్యంలో స్థానిక డివిజన్‌లో మంగళవారం సాయంత్రం పర్యటించారు. ఇస్లాంపేటలోని మిలాప్ హోటల్ నుంచి ప్రారంభమైన పర్యటన బాబురాజేంద్రప్రసాద్‌రోడ్డు, పాడివీధి, తదితర ప్రాంతాల మీదుగా రాయల్‌హోటల్‌కు చేరుకుంది. అక్కడ డివిజన్‌లోని ఓల్డ్ ఉడ్ మర్చంట్స్ అసోసియేషన్ నేత అబ్దుల్ కౌవర్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఎన్నికలకు సిద్ధం అంటూ ముద్రించిన కేక్‌ను ఆసిఫ్ కట్ చేశారు. కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావుతో పాటుగా యలకల చలపతిరావు, ఆర్షద్, మండేపూడి ఛటర్జీ, మరుపిళ్ల రాజేష్, శ్రీశైలం దేవస్థానం సభ్యుడు గురుమహంతు మహేష్, దుర్గాకోఆపరేటివ్ మాజీ చైర్మన్ కొరగంజి భాను, నాయకులు విశ్వనాథ రవి, బుదాల శ్రీనివాసరావు, మజ్జి శ్రీనివాసరావు, రాజా రమేష్, బాజీ, ఖాదర్, అమానుల్లా, సుభాన్ ఖాన్, చాన్, అన్వర్, సమీర్, రెహమాన్, ఎడ్పర్ల మురళీ, మైలవరపు దుర్గారావు, మండల శ్రీను పాల్గొన్నారు.

ఉత్తమ సేవకు ప్రశంస







కలెక్టర్ ఢిల్లీరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వి. ఇందిరాకుమారి; డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సొంగా వినయ్‌కుమార్; డెప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ యు. శోభ



అడ్మినిస్ట్రేషన్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి



జూనియర్ అసిస్టెంట్ పీఎం కబీర్



గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. సబిత



జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్



హెడ్‌నర్స్ జి. మార్తమ్మ

లబ్బీపేట(విజయవాడతూర్పు): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వాస్పత్రిలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న పలువురు వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు మంగళవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. నగరంలోని తన కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారితో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అడ్మినిస్ట్రేషన్ అధికారులు, సిబ్బంది ఉన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ డి. వెంకటేష్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ఎస్ విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై ఫొటోలు ధ్వంసం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 47వ డివిజన్ పరిధిలోని ఏనుగుల లక్ష్మణరావు వీధి కూడలిలో నిర్మించిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసేందుకు దుండగుడు విశ్వప్రయత్నం చేశాడు. డివిజన్‌లోని కేఎల్ రావునగర్‌లో రూ.37.22 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు ఈ నెల 20వ తేదీన పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగతో కలిసి శంకుస్థాపన చేశారు. దీని నిమిత్తం ఏర్పాటు చేసిన శిలఫలకంపై ఉన్న ఫొటోలను గుర్తు తెలియని దుండగుడు రాయితో ఛిద్రం చేశాడు. మంగళవారం ఉదయమే స్థానికులు చూసి కార్పొరేటర్ గోదావరి గంగ, ఆమె భర్త గోదావరి బాబుకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలానికి వెళ్లి స్థానికులను విచారించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు తాడేపల్లికి చెందిన అనురాధ బెంజ్‌సర్కిల్ వద్ద ఓ డెంటల్ హాస్పిటల్‌లో పని చేస్తుంది. 29వ తేదీ సోమవారం ఉదయం హాస్పిటల్‌కు వెళ్లిన అనురాధ సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. అనురాధ ఇంటికి రాకపోవడంతో అన్నయ్య రాఘవ హాస్పిటల్‌కు ఫోన్ చేయగా డ్యూటీ దిగి వెళ్లిపోయిందని చెప్పారు. అయితే రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

10 నుంచి గుప్తా నవరాత్రులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నైనవరం ఫ్లై ఓవర్ సమీపంలోని శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో గుప్తా నవరాత్రి మహోత్సవాలను ఫిబ్రవరి 10 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 9 రోజుల పాటు అమ్మవారు 9 విశేష అలంకారాల్లో పూజలు అందుకోనున్నట్లు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు కలశ పూజ, సహస్ర నామార్చన, 8 గంటలకు హోమాలు నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 5 గంటలకు సామూహిక లలితా సహస్ర పారాయణం, 7 గంటలకు అమ్మవారికి విశేష హారతులు జరుగుతాయన్నారు. 16వ తేదీ అమ్మవారికి లక్ష బిల్వ పత్రాలు, దశ సహస్ర తమల పాకులతో కలువ పువ్వులతో సహస్ర నామార్చన ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పున్నమి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ శంకర మఠం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జొన్నవిత్తులవారి వీధి, శంకర మఠం, పార్థసారథి వీధి, గురుకృప రోడ్, టీవీ కృష్ణారావు వీధి, గుప్తా సెంటర్ డౌన్, షాదీఖానా ఏరియా, అండిమాని బ్రహ్మయ్య వీధి, పోస్ట్ ఆఫీస్ రోడ్, బుద్ధావారి వీధి, కేసీ పబ్లిక్ స్కూల్ రోడ్, సిమెంట్ రోడ్ ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు.

చిట్టినగర్ సెక్షన్ పరిధిలో..

చిట్టినగర్ సెక్షన్ పరిధిలోగల 11 కేవీ కంసాలిపేట ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పాత మసీదు, 35 గజాలు, మణికంఠ మెడికల్స్, కొత్త మసీదు, రెడ్డి కొట్టు, కంసాలి పేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు సుధాకర్ చెప్పారు.

భవానీపురం సెక్షన్ పరిధిలో..

భవానీపురం పరిధిలోని 11 కేవీ భవానీపురం ఫీడర్ లైన్ల మరమ్మతులలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల ఎంఐజీ–1 బ్లాకులు, స్వాతి థియేటర్ రోడ్, మానవమందిరం రోడ్, అమృత అపార్ట్‌మెంట్ రోడ్, పోపూరివారి వీధి, హనుమయ్య వీధి, గుడివాడ రామారావు వీధి, ప్రసాద్ హోటల్ రోడ్, లత హాస్పిటల్ రోడ్, ఎంపీ దాస్ వీధి, ఆకుల రాజేశ్వరరావు మిల్ రోడ్, చెట్ల బజార్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని సుధాకర్ వివరించారు.